క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వటం చట్టరీత్యా నేరమని సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. శ్రీకాకుళం, సీతంపేట, విశాఖ రహదారిలో శుక్రవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు, వాహన యజమానులకు అవగాహన కల్పించారు. తొలి తప్పిదంగా వాహనాలు నడుపుతున్న మైనర్లకు హెచ్చరించారు. మద్యం సేవించి, మితిమీరిన వేగంతో, అధిక లోడు, ప్రయాణికులతో వచ్చే వాహనాల చోదకులకు అపరాధ రుసుము విధించారు. వాహన రికార్డులు కచ్చితంగా ఉండాలని సూచించారు.

వేతనదారులతో సమావేశం



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: ఎంఎన్ఆర్ఈజీఎస్ రోజ్‌గార్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కిరపలో ఉపాధి హామీ వేతనదారులతో ఎంపీడీఓ కె.గీతాంజలి శుక్రవారం సమావేశం నిర్వహించారు. వంద రోజుల పనిదినాలు, జాబ్‌కార్డుల అప్డేట్ గూర్చి చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో అందరికీ ఆరోగ్యం



వడ్డంగిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భామిని: వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో కుటుంబానికి రూ.25లక్షల వరకు అత్యవసర శస్త్రచికిత్సలతో సంపూర్ణ ఆరోగ్యం వర్తింపజేశారని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ పసుపలేటి సోయల్ అన్నారు. మండలంలోని వడ్డంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష 2 ప్రొగ్రాం కింద ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఇంటింట వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నెలవారీ మందులు, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, సీహెచ్ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది శిబిరంలో తమ వంతు సేవలు అందించారు. వైఎస్సార్ కంటి వెలుగులో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.

మద్యం సీసాల పట్టివేత



పట్టుబడిన ముద్దాయితో చినమేరంగి ఎస్ఐ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామ శివారులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 48 క్వార్టర్ల మద్యం బాటిళ్లను చినమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. కుదమ గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి పట్టుకున్నట్టు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

బలిజిపేట: పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అవసరమని గళావల్లి పంచాయతీ గేదెలపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించి, సూర్యనమస్కారాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు 'జగనన్న పచ్చతోరణం'

పార్వతీపురం టౌన్: జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా వాడవాడలా మొక్కలు నాటి సంరక్షించడం వల్ల ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని ఎమ్మెల్యే అలజంగి జోగరావు అన్నారు. పార్వతీపురం బైపాస్ ప్రధాన రహదారికి ఇరువైపులా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరాల్లో కూడా విరివిగా మొక్కలు నాటి ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

దేశానికే ఆదర్శం వలంటీర్ల వ్యవస్థ



గరుగుబిల్లి: వలంటీర్లను సత్కరించిన ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

పాలకొండ రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో అమల్లోకి వచ్చిందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం అంపిలి గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొండాపురం, గోపాలపురం గ్రామాలకు చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాలను ప్రధానం చేశారు. చినమంగళాపురం సచివాలయంలో ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో స్థానిక వలంటీర్లతో పాటు జీఎంపురం సచివాలయానికి చెందిన వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు గవర రాజశేఖర్, కరణం బాబ్జీ, గోగుల కల్యాణి, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, ఎంపీడీఓ జి.పైడితల్లి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు వాలంటీర్లు

గుమ్మలక్ష్మీపురం: వలంటీర్లు నిస్వార్థ సేవకులని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం-1, గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వలంటీర్లకు పురస్కారాలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో ప్రాధాన్యమైందని, నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించడం సంతోషదాయకమన్నారు. మండలంలో మొత్తం 353 మంది వలంటీర్లు ఉండగా ఇరువురికి సేవా వజ్రా, ఐదుగురికి సేవా రత్నా పురస్కారాలు, మిగతా సభ్యులకు సేవా మిత్ర పురస్కారాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్ఎస్ చైతన్య స్రవంతి, గ్రామ సచివాలయం ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. వీరఘట్టం మేజరు పంచాయతీలో వలంటీర్లుకు సేవా మిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పని చేస్తున్న వలంటీర్లను చూస్తే ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. అందుకే స్వచ్ఛందంగా పనిచేస్తున్న వలంటీర్లపైన కూడా ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఎంపీపీ అన్నారు. అనంతరం వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రధానం చేసి వారిని శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజ్, ఈఓ వి.రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, శంభాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్‌లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడులన్నారు. మండంలోని గొట్టివలస గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వలంటీర్లు చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి వారిని మరింత ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా బి.ఈశ్వరమ్మ, జి.రత్నకుమారి, బి.కరుణ, ఎ.భారతి, డి.రూప, ఎం.దివ్యతేజ, బి.దిలీప్‌కుమార్, సిహెచ్.రవికుమార్, ఎ.అప్పన్న, బి.జనార్ధనరావు, బి.సింహగిరిలను ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

భామినిలో..

భామిని: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందజేయడంలో గ్రామ వలంటీర్లు సేవలు మరువలేనివని నేరడి-బి, గురండి సర్పంచ్ సరిసాబత్ర జగదాంబ, జామి బైరాగి అన్నారు. నేరడి-బి సచివాలయంలో కార్యదర్శి లోవ అనసూయ ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా అవార్డు గ్రహీతలైన వలంటీర్లుకు శుక్రవారం సన్మానించారు. అనంతరం నేరడి, గురండి, లోహరిజోల గ్రామ వలంటీర్లను సచివాలయ ఉద్యోగులు సన్మానించారు.



పాలకొండ రూరల్: అంపిలి సచివాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భామిని: వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శి



గుమ్మలక్ష్మీపురం: వలంటీర్‌కు పురస్కారం ప్రధానం చేస్తున్న ఎంపీడీఓ జగదీష్‌కుమార్, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, సర్పంచ్ గౌరీశంకరరావు



వీరఘట్టం: వలంటీరును సత్కరిస్తున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తదితరులు

ఐటీడీఏతో మరిన్ని సేవలు



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐటీడీఏ పీఓ

- ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ఐటీడీఏ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా చర్యలు ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను పీఓ కల్పనాకుమారితో కలిసి వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించే ఈ బంక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు. అత్యంత ప్రాధాన్యత ఉన్న సెంటర్‌లో బంకు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులకు వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. డీఎస్పీ కృష్ణారావు, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు



పరశురాంపురంలో కాలువలు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు

కొమరాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని, డ్రై డేని తప్పనిసరిగా నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పరశురాంపురం గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఆయన గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ఇంటి పరిసరాల్లోని కాలువల పూడికతీతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉపయోగం లేని వస్తువులు, పాడైన ప్లాస్టిక్ వస్తువుల, టైర్లు, కాలువల్లో చెత్త నిండి ఉండడం, ఫ్రిజ్ వెనుక భాగంలోని ట్రేలో చేరిన నీరు, తదితర వస్తువులపై దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, ఫైలేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. కావున పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో డ్రై డేను ప్రతీ వారం పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్లో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

కొమరాడ: రథసప్తమి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమరాడ, పరుశురాంపురం, విక్రంపురం తదితర గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సివిని సమీపంలోని సూర్యపీఠంలో సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మక్కువ: మండలంలోని పాయకపాడు, మేలాపువలస, గోచెక్క గ్రామాల్లో శుక్రవారం మక్కువ అటవీశాఖ అధికారి కె.నారాయణరావు ఆధ్వర్యంలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అడవులకు నిప్పు పెట్టారాదని, అగ్గిపెట్టెలు, సిగరెట్లు తీసుకెళ్లకూడదని, అడవులను, వణ్య ప్రాణులని రక్షించుకోవాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కె.గణపతి, రమణ, సతీష్, సూర్యనారాయణ, పాలొన్నారు

ఎస్పీని కలిసిన ఏఆర్ డీఎస్పీ



పార్వతీపురం టౌన్: ఇటీవల ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. వెంకట అప్పారావు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పారావు ఇంతవరకు కాకినాడ డీఏఆర్‌లో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం జిల్లాకు బదిలీపై వచ్చారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

వీరఘట్టం: ప్రతీసారి సార్వత్రిక ఎన్నికల సమయంలో వీరఘట్టంలోని 250, 251, 252 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఒకే పాఠశాలలో వెళ్లేందుకు, వచ్చేందుకు ఒకే ద్వారం ఉన్న మూడు గదుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేస్తూ ఈ నెల 9న సాక్షిలో ప్రచురితమైన 'వేర్వేరు చోట్ల వద్ద...ఒకే చోట ముద్దు'అనే కథనంపై ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి స్పందించారు. వాస్తవ పరిస్థితులు తెలియజేయాలని అధికారులను ఇటీవల కోరారు. దీంతో ఇక్కడ సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని అధికారులు తెలిపారు. అయితే వెంటనే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకుని ఈ కేంద్రాలను అనువైన చోటకు మార్చాలని పీఓ ఆదేశించారు.

దీంతో శనివారం అన్ని రాజకీయ పార్టీలతో స్థానిక కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జయప్రకాష్ శుక్రవారం తెలిపారు. వీరఘట్టంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు విధిగా సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో నాలుగు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో వచ్చిన తప్పులను సవరిస్తున్నామన్నారు. మార్చాల్సిన పోలింగ్ కేంద్రాల లిస్టును త్వరితగతిన ఇవ్వాలని సూచించారు. దీనికి సంబంధించి రాజకీయ పార్టీలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, తీర్మానం చేసి మాత్రమే మార్చాలన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

పనుల్లో వేతనదారులంతా పాల్గొనాలి



ఉల్లిబద్రలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ గౌరీనాథ్

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఏపీఓ ఎం.గౌరీనాథ్ అన్నారు. మండలంలోని ఉల్లిబద్ర పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ పథకం ఇంజినీరింగ్ అధికారులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్లలో అటెండెన్స్ వేయాలన్నారు. వేతనదారులు రెండు పూటలా పనుల్లో పాల్గొనాలన్నారు. పరిశీలనలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనం నిర్వహణపై సూచనలిస్తున్న విద్యా శాఖ ఏడీ దామోదరరావు

కురుపాం: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యాశాఖ ఏడీ పి.దామోదరరావు, ఎండీఎం జిల్లా కో ఆర్డినేటర్ జి.శివున్నాయుడు అన్నారు. విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఆలోచన చేస్తూ మంచి పౌష్టికాహారం అందించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. భోజనాలు బాగోలేదని ఆదర్శ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ సత్యనారాయణకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం సందర్శించి పరిశీలించిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యా శాఖ ఏడీ, ఎండీఎం జిల్లా కో ఆర్డినేటర్ శుక్రవారం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన సమస్యలపై ప్రిన్సిపాల్, భోజన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఇటువంటి సమస్యలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందివ్వాలన్నారు. అనంతరం స్టాక్‌రూంను పరిశీలించి పాడైన చోడి పిండిని ప్యాకెట్లను తిరిగి పంపించాలని సూచించారు. వారి వెంట కురుపాం ఎంఈఓ సత్యనారాయణ, యు.నాగేశ్వరరావు ఉన్నారు.

ఐక్య పోరాటాలతో బీజేపీకి గుణపాఠం



సీతంపేట: మానవహారం చేస్తున్న కార్మికులు



పాలకొండ రూరల్: వైఎస్సార్ కూడలి వద్ద కేంద్రానికి వ్యతిరేక నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల, సీఐటీయూ నాయకులు



జియ్యమ్మవలస: మండల కేంద్రంలో గిరిజన సంఘాల నాయకుల ర్యాలీ



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద మానవహారం చేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ రూరల్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ఐక్య పోరాటాలతో బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు అన్నారు. గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా వైఎస్సార్ కూడలి వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల సమన్వయ కమిటీ సభ్యుడు కాద రాము, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, కార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు, ఎస్.గంగయ్య తదితరులు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక చట్టాలు అమలు చేసి, పెట్రోలు, డీజిల్ ధరలపై భారం పెంచుతూ అన్ని వర్గాల వారిని మోదీ ప్రభుత్వం అవస్థల పాల్జేసిందన్నారు. ఈ క్రమంలో చేపట్టిన గ్రామీణ బంద్ విజయవంతమైందన్నారు.

జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు కూరంగి సీతారాం మాట్లాడుతూ మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి బి.మోహనరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కార్మిక సంఘాల బంద్

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ అన్నారు. డీజిల్ పెట్రోల్‌పై నూతన చట్టాలతో పెంచిన ధరలను నిరసిస్తూ, ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె

సీతంపేట: గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏపీజీఎస్, సీఐటీయూ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సీతంపేటలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.మన్మదరావు, కాంతారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

భామినిలో..



భామిని: నినాదాలు చేస్తున్న కార్మికులు

భామిని: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించకుండా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా కార్మిక, కర్షక ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. ప్రజా సంఘాల నాయకులు కె.మిన్నారావు, జి.జగన్నాయకులు, కె.భాస్కరరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.